


పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీ : కలెక్టర్

తిరుపతి టౌన్ : ఎటువంటి లోపాలకూ ఆస్కారం లేకుండా పటిష్టమైన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ- 2024 తయారు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ - 2024 పై ఈ ఆర్వో లతో , ఏఈఆర్వోలతో, ఎలక్షన్ డిటీ లతో డి ఆర్ ఓ కోదండరామిరెడ్డి తో కలసి సమీక్ష నిర్వహించారు. ఇంటింటి సర్వే మేరకు జాబితాలోని మార్పులు చేర్పులు 100 శాతం కచ్చితంగా నిర్వహించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు రాకూడదని తెలిపారు. బిఎల్వోలు ఓటర్ల జాబితా పరిశీలించి అప్డేట్ చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమీక్షలో ఈఆర్వోలు గూడూరు -కిరణ్ కుమార్, వెంకటగిరి -కోదండరామిరెడ్డి, చంద్రగిరి- కనక నరసారెడ్డి, తిరుపతి - హరిత, శ్రీకాళహస్తి-రామారావు, సత్యవేడు శ్రీనివాసులు, స్మార్ట్ సిటీ జి యం చంద్రమౌళి పాల్గొన్నారు.

కాండ్ర ఎస్సీ, ఎస్టీల భూములను కాపాడాలి : సిపిఎం


తిరుపతి కలెక్టరేట్ ఎదుట సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆధ్వర్యంలో బాధితుల నిరసన

ప్రజాశక్తి - తిరుచానూరు


గూడూరు మండలం కాండ్ర గ్రామానికి చెందిన దళిగ గిరిజనులకు ఓజిలి మండలం వీర్లగునపాడు రెవెన్యూ గ్రామమునందు 20 సంవత్సరాల క్రితం భూములను కేటాయించమని గూడూరు తాసిల్దార్ అర్హుల జాబితాను ఓజిలి తాసిల్దార్‌కు పంపారు. ఈ ఆధారంగా ఎస్సీ ఎస్టీలు వీర్లగునపాడులోని సర్వేనెంబర్ ఒకటి నుంచి 30 వరకు గల భూముల్లో సాగు చేసుకుంటున్నారు. ఈ సాగును ధ్రువీకరిస్తూ వీఆర్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్‌లు ఎఫ్ఎంబిలో నమోదు చేశారు. ఈ భూముల్లో నిమ్మచెట్లు వేసుకుని ఇతర పంటలు పండించుకుంటున్నారు. అయితే గత ఏడాది అగ్రకుల పెత్తందారైన పెంచలరాజు ఈ భూముల నుంచి దళిత గిరిజనులను వెళ్లగొట్టి దౌర్జన్యం చేసి కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఈ సమస్యపై సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆధ్వర్యంలో కలిసి అర్జీ సమర్పించారు. స్పందించిన కలెక్టర్ ఓజిలి తహశీల్దార్‌తో ఫోన్ చేసి మాట్లాడి ప్రభుత్వ భూములైతే ప్రైవేట్ వ్యక్తులు ఎలా ఆక్రమించుకుని కంచె వేస్తున్నారని ప్రశ్నించారు. జేసీని విచారణకు ఆదేశించారు. దళితుల భూములకు రక్షణ కల్పించి వారికి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ముత్యాలయ్య, నాయకులు బి.నారాయణ, ఆర్.శ్రీనివాసులు, ఆర్.గోవిందయ్య, ఓ.జయంతి, కే .సురేష తదితరులు పాల్గొన్నారు.

టిటిడి అటవీ కార్మికుల దీక్షకు 'మా అందరి మద్దతు'

ప్రజాశక్తి - క్యాంపస్, యంత్రాంగం, తిరుపతి టౌన్

టీటీడీ అటవీ కార్మికుల రిలే దీక్షలు 27వ తేదీకి వెయ్యి రోజులకు చేరుతున్న తరుణంలో, వారి దీర్ఘకాలిక పోరాటాన్ని అభినందిస్తూ తమ అందరి మద్దతును అందిస్తున్నామని కాంట్రాక్టు కార్మికులు జిల్లావ్యాప్తంగా గళమెత్తారు. టిటిడి అటవీ కార్మికులకు మద్దతుగా తిరుపతి వ్యవసాయ కళాశాల ఆవరణలో కాంట్రాక్టు ఉద్యోగులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులందరూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా తిరుపతి వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు ఉద్యోగులతో ధర్నాలో మాట్లాడుతూ టీటీడీలో ధర్మాన్ని ఆచరించండి ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రతినిత్యం ప్రచారం చేసే చోట అధర్మం రాజ్యమేలుతున్నదని, అటవీ విభాగంలో గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న 362 మంది కార్మికుల్లో జూనియర్లను పర్మినెంట్ చేసి సీనియర్లను వీధులు పాలు చేసిన దారుణం టిటిడిలోనే కనిపిస్తుందన్నారు. వెయ్యి రోజులుగా దీక్షలు చేస్తున్నా 'ఏమీ మీ బాధ' అని అడిగిన నాధుడు టిటిడిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ కళాశాల కాంట్రాక్ట్ ఉద్యోగుల కార్యదర్శి రాకేష్ పాల్గొన్నారు.

టీటీడీ అటవీ కార్మికుల 1000 లు దీక్షలు మద్దతుగా తిరుపతి


తిరుపతి పశువైద్య కళాశాల ఆవరణలో..

వెటర్నరీ కళాశాల కాంట్రాక్ట్ ఉద్యోగులతో ధర్నాలి

తిరుపతి పశువైద్య కళాశాల ఆవరణలో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆప్కాస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గండికోట చిన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంపూర్ణ మద్దతు టిటిడి ఫారెస్టు కార్మికులకు ఉంటుందన్నారు.

టిటిడి ఫారెస్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలి!

తిరుపతి టౌన్ : టిటిడి ఫారెస్ట్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు జులై 27వ తేదీ నాటికి 1000 రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో, ఫారెస్ట్ కార్మికులు పెద్ద ఎత్తున చేపడుతున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా సోమవారం యశోద నగర్ లోని ఎంబి భవన్ లో కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలతో సిఐటియు నగర్ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు టి సుబ్రమణ్యం అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ టీటీడీ బోర్డు చేసిన తీర్మానం ప్రకారం ఫారెస్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 1000 రోజులకు చేరుకుంటున్నా టీటీడీ యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం జయంతి, పి. సాయి లక్ష్మి మాట్లాడుతూ ఫారెస్ట్ కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వడమే కాకుండా, ప్రత్యక్షంగా పాల్గొని అండగా ఉంటామన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. నరేంద్ర మాట్లాడుతూ ధర్మారెడ్డి ఈవోగా వచ్చినప్పటి నుండి వివాదాస్పద నిర్ణయాలు చేస్తూ టీటీడీ ప్రతిష్టను దిగదార్చడం వల్లనే ఫారెస్ట్ కార్మికులు దీక్షలకు దిగాల్సి వచ్చింది అన్నారు. ఈవో తీరు మార్చుకోవాలన్నారు. టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రఘు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను, ఎఫ్ఎంఎస్ కార్మికులను అంటరాని వారిగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి పి చిన్న, ఆటో డ్రైవర్ యూనియన్ నగర కార్యదర్శి తంజావూరు మురళి మాట్లాడుతూ టీటీడీలో అధర్మ పాలన కొనసాగుతుందని విమర్శించారు. జూలై 27వ తేదీ జరిగే నిరసన కార్యక్రమంలో వందలాది మంది కార్మికులు పాల్గొంటామని రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులుశ్రీరాములు ,నారాయణస్వామి, శేషయ్య, సుజాతమ్మ, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు సంఘీభావం ప్రకటించారు.


తిరుపతి వ్యవసాయ కళాశాల ఆవరణలో..

గూడూరు టౌన్ : గూడూరు సిఐటియు కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వెయ్యి రోజులుగా టిటిడి అటవీ కార్మికులు ఆందోళన చేసినా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బివి రమణయ్య, ఎస్.సురేష్, జోగి శివకుమార్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం, వృకాసం, కార్మిక నాయకులు

30న విజయవాడలో కార్మిక-కర్షక రాష్ట్రసదస్సు


తిరుపతి టౌన్ : ఈనెల 30న విజయవాడలో జరిగే కార్మిక కర్షక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తిరుపతి ఎంబి భవన్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జనార్ధన్, హేమలత, రంగయ్య, రైతుకూలి సంఘం నాయకులు హరీష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, కార్మిక సంఘం నాయకులు కెఎన్ఎన్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఎకనోమెట్రిక్స్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుతో ఉపాధి



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని 2023-24 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2023 లో ఉత్తీర్ణత సాధించిన అర్థశాస్త్రం, మాథెమాటిక్స్, స్టాటిస్టిక్స్ విద్యార్థులు ప్రతిఒక్కరూ ఎకనోమెటిక్స్ (ఆర్థిక గణాంక శాస్త్రం)కోర్సు చేరుటకు అర్హులు అన్నారు. ఎకనోమెట్రిక్స్ పూర్తిచేసిన వారికి ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని విభాగాధిపతి ఆచార్య వినోదిని, డాక్టర్. సునీత, బిఒఎస్ చైర్మన్ పేర్కొన్నారు . ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్ 2023 లో ఆర్థిక శాస్త్రం, స్టాటిస్టిక్స్, మాథెమాటిక్స్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎకనోమెట్రిక్స్ విభాగంలోని అధ్యాపకులు అన్ని రకాల సదుపాయాలతో పాటు మంచి ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. ఎస్వీయూలోని ఎకనోమెట్రిక్స్ విభాగానికి ప్రత్యేకంగా గ్రంథాలయం ఉందని చెప్పారు. ఎకనోమెట్రిక్స్ కోర్సులో 30సీట్లు ఉంటాయన్నారు. విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతి గదులు డిజిటల్ తరగతి గదులు కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యముతోపాటు పోటీ పరీక్షలకు ప్రత్యేకమైన తరగతులు, సదస్సులు ఉంటాయన్నారు. ఎకనోమెట్రిక్స్ పీజీ చేసిన తర్వాత విద్యార్థులకు ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ, ఇంటర్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం బోధించడానికి మంచి అవకాశాలుంటాయన్నారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, అగ్రికల్చర్, వెటర్నరీ వంటి పలు కోర్సులలో ఎకనోమెట్రిక్స్ ఒక సబ్జెక్టు గా ఉంటుందన్నారు. అంతేకాకుండా విదేశాలలో కూడా ఎన్నో విశ్వవిద్యాలయాలలో ఎకనోమెట్రిక్స్ పీజీ చేసిన విద్యార్థులకు ఎన్నో ఉన్నతమైన అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు.

'స్పేస్' పోటీలలో కృష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ ప్రతిభ


విద్యార్థులతో కృష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ సిఇఒ

తిరుపతి సిటీ : స్పేస్ వీక్ పోటీలలో కష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల సీఈవో బి. అలేఖ్య తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక హథీరాంజీ కాలనీ బైరాగి పట్టెడలోని కష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాల విద్యార్థులు తిరుపతిలో ఉన్న ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగినటువంటి స్పేస్ వీక్ లో వివిధ పోటీలలో ప్రతిభ కనపరిచి తమ పాఠశాల ప్రతిష్టను ఇనుముడింప చేశారన్నారు ఈ సందర్భంగా విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జనార్ధన్, హరిబాబు పాల్గొన్నారు.

29న ఎన్ఇపి మూడో వార్షికోత్సవం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ విద్యా విధానం - 2020 అమలు చేస్తున్నామని, ఈనెల 29న ప్రగతి మైదాన్‌లో మూడవ వార్షికోత్సవం భారత ప్రధాని అధ్యక్షతన నిర్వహించుకోనున్నామని, ఎన్ఈపి విద్యా విధానంలో విద్యార్థులకు సౌలభ్యంగా కోర్సులు, మార్పులకు అవకాశం ఇస్తూ అనేక కార్యక్రమాలు కేంద్ర విద్యాసంస్థలలో, విశ్వవిద్యాలయాల స్థాయిలో అమలు చేస్తున్నామని తిరుపతి ఐఐటి డైరెక్టర్ కేఎన్. సత్యనారాయణ అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్ లో జాతీయ విద్యావిధానం 2020 పై తిరుపతిలోని కేంద్ర విద్యాసంస్థలు, జాతీయ విద్యాసంస్థలు, యూనివర్సిటీలు సంయుక్తంగా ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి తమ పరిధిలో అమలు చేస్తున్న కోర్సులు వెసులుబాటులు వంటివి వివరించారు. ఐఐటి డైరెక్టర్ మాట్లాడుతూ విశ్వ గురువుగా పేరు ఉన్న ప్రాచీన భారతీయ విశ్వవిద్యాలయాల స్థాయికి ఈ జాతీయ విద్యా విధానం 2020 అమలుతో తిరిగి ఆ స్థాయిని తీసుకు రాగలమని అన్నారు. ఈ విధానంతో పాఠ్యప్రణాళికలను సవరించి విద్యార్థి స్వేచ్ఛగా తన కోర్సు ఎంచుకునేలా ప్రోత్సాహం ఇస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్, టెక్నాలజీ కోర్సులు, ఇంటర్న్‌షిప్ లు, చదువుతున్న సమయంలోనే ముందుగానే నిష్క్రమించడం, అందుకు తగ్గ ధ్రువపత్రాలను అందించడం జరుగుతున్నదని అన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కె. రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దష్టి పెట్టి విద్యకు పెద్దపీట వేస్తున్నారని యూనివర్సిటీలో ఎన్ఈపి విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ విధానంతో స్కిల్ డెవలప్మెంట్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. జాతీయ విద్యా విధానం అమలులో రాష్ట్ర ప్రభుత్వం ఒక బెంచ్ మార్క్ గా నిలిచిందని అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ చాన్సలర్ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ ఎన్ఈపి విద్యా విధానం మేరకు డిప్లమా డిగ్రీ సర్టిఫికెట్ కోర్సులను అమలు చేయడం జరుగుతున్నదని స్కిల్ డెవలప్మెంట్ కు ప్రాధాన్యతనిస్తూ వివిధ కేంద్ర సంస్థల సహకారంతో విద్యా బోధన చేపట్టడం జరుగుతున్నదని అన్నారు.

జాతీయ సంస్కత యూనివర్సిటీ ప్రొఫెసర్ శంకరనారాయణ మాట్లాడుతూ ప్రాచీన భారత దేశంలో నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు ప్రపంచ ప్రసిద్ధి చెందినవని ఆ మేరకు జాతీయ సంస్కత యూనివర్సిటీలో భారతీయ సంస్కతి బోధనతో పాటు అండర్ గ్రాడ్యుయేట్ యుజి కోర్సుల నిర్వహణ జాతీయ విద్యా విధానం మేరకు అమలు చేస్తున్నామని చెప్పారు. వీటితోపాటు ఒకేషనల్ కోర్సులు సైన్స్ కోర్సులు వంటివి హిస్టరీ మోడరన్ హిస్టరీ బోధనలు చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలలో ఫౌండేషన్ కోర్సుల నుండే ఎన్ఈపి అమలు చేస్తున్నామని, బాలవాటిక ఏర్పాటు చేసి ఫైవ్ ప్లస్ త్రీ ప్లస్ త్రీ ప్లస్ ఫోర్ అనే విధానంతో పగడ్బందీగా బోధనలు చేపడుతున్నామని పీఎం కౌశల్ యోజన, ఒకేషనల్ కోర్సులు, ఏఐ టెక్నాలజీ, ఇతిహాసాలు, ఇతర భాషలో నేర్పించడం వంటి వాటిపై బోధనలు చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 72 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయని వాటిలో ఎన్పిపి అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఐజర్ ప్రొఫెసర్ రాజేష్ విశ్వనాథన్, ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఓఎండి హుస్సేన్, ఐఐటి డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్ మెహతా, ఎస్వీయూ మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుపతిలో రహదారుల విప్లవం : భూమన



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో ప్రారంభించిన మాస్టర్ ప్లాన్ రోడ్లు, తీసుకురాభోతున్న మరిన్ని రహదారులతో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో రహదారుల విప్లవం మొదలైందని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతిలో నిర్మించబోవు మాస్టర్ ప్లాన్ రోడ్లను సోమవారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, టిటిడి జేఇఓ వీరబ్రహ్మం, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, ఎస్వీ యూనివర్సిటీ వైస్ చాన్స లర్ రాజారెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డిలు చెన్నారెడ్డి కాలనీ నుండి ఇస్కాన్ రోడ్డును కలిపే రహదారిని, ఎస్వీ యూనివర్సిటీ నుండి అలిపిరి వైపు వచ్చే రహదారులను, జబ్బార్ లే అవుట్ నుండి శ్రీదేవి కాంప్లెక్స్ వెనుక వచ్చే రహదారిని, శ్రీనివాసం వెనుక నుండి వై.ఎస్.ఆర్ మార్గ్ వైపు వచ్చే రహదారిని, సబ్ వేలను పరిశీలించారు. 17 మాస్టర్ ప్లాన్ రోడ్లను, నగరంలో అంతర్గత రహదారులను, అలాగే ఫ్రీ లెఫ్టులను ఇలా అనేక రూపాలలో తీసుకురావాలనే తలంపుతో, ఒకవైపున టీటీడీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మరోవైపున ఎస్వీ యూనివర్సిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అనేక రూపాలుగా ఉన్నటువంటి సమస్యలన్నింటిని కూడా ఒకే దారికి తెచ్చి, అందరి సమన్వయంతో ఈ రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, మునిసిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, బొగ్గుల పుణిత, పుల్లూరు అమర్నాధ్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, డిఈ గోమతి, సర్వేయర్ దేవానంద్ పాల్గొన్నారు.

పరిశోధనల్లో ఎస్‌వి వైద్య కళాశాల ముందడుగు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల వైద్య పరిశోధనలో ముందడుగు వేసిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్య పరిశోధనల మీద ఎస్ వి వైద్య కళాశాల ముందడుగు. అదనపు వైద్యవిద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పరిశోధనలు జరుగుతున్నవి. కేంద్ర ప్రభుత్వం (ఐసిఎంఆర్) ఆధ్వర్యంలో ఎస్వీ వైద్య కళాశాలలో మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎం ఆర్‌హెచ్‌ఆర్‌యు) చంద్రగిరి, మల్టీ డిస్ప్లినరీ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌యు) అను రెండు పరిశోధన యూనిట్లు దిగ్విజయముగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య పరిశోధనలో ఇప్పటివరకు 42 పరిశోధనా పత్రాలు ప్రారంభించగా, 18 పరిశోధనలు పబ్లిష్ అయ్యాయి. ఇక 24 పరిశోధనలు జరుగుతున్నవి. ఇప్పటివరకు ఐదు నేషనల్ వర్క్ షాప్స్ చేయడం జరిగినది. ఈ విధంగా 125 మంది రీసెర్చ్‌లో ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది. 14 రీసెర్చ్ పత్రాలు ముద్రించడం జరిగినది. యు జి, పీజీ,వైద్య విద్యార్థులకు వైద్య పరిశోధన మీద దష్టి సారించడం జరిగినది. 60 మంది పీజీ వైద్య విద్యార్థులు నిరంతరం వైద్య పరిశోధనలు జరుగుతున్నది. ఇలాంటి పరిశోధన వలన మెరుగైన వైద్యం అందించడానికి ఎంతో దోహదపడుతుందని ఎం ఆర్ యు నోడల్ అధికారి డాక్టర్ ఏఎస్.కిరీటి తెలిపారు. ఇలాంటి పరిశోధనల వలన ఊబకాయము, క్షయ వ్యాధి , కొన్ని ప్రాణాంతకమైన వ్యాధులను ముందుగానే గ్రహించి మెరుగైన వైద్యం అందించగలమని తెలిపారు. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పారు. ఎం ఆర్ యు సైంటిస్ట్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ సునీత న్యూట్రిషన్స్ట్, పిల్లల విభాగం, ఎస్ వి వైద్య కళాశాల పి. ఆర్. ఓ. వీర కిరణ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే మణిపూర్‌లో పాశవిక దాడులు

తిరుపతి సిటి : కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకే మణిపూర్‌లో గిరిజనులపై పాశవిక దాడులు జరుగుతున్నాయని కవులు, ప్రజాస్వామికవాదులు ఖండించారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో మణిపూర్ గిరిజనులపై దాడులకు సంబంధించి సాహితీ స్రవంతి కన్వీనర్ ఓ.వెంకటరమణ అధ్యక్షతన సదస్సు జరిగింది. ప్రముఖ కవి నెమిలేటి కిట్టన్న మాట్లాడుతూ 'భిన్నత్వంలో ఏకత్వం' గల భారత దేశంలో ఇటువంటి మత విద్వేషాలు రగిలించడంలో పాలకవర్గ రాజకీయ ప్రయోజనం దాగి ఉందన్నారు. వేమన విజ్ఞాన వేదిక కన్వీనర్ నాగార్జున మాట్లాడుతూ 26న బుధవారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. నడ్డినారాయణ, సాయిలక్ష్మి, రఫి, మునిరామయ్య, జయంతి, పద్మజ, రెడ్డెప్ప, ఇమామ, జయరాం, ముఖేష్, బాలసుబ్రమణ్యం, నాగరాజు పాల్గొన్నారు.



నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ/ గూడూరు టౌన్

ఆధునిక సాహిత్యంలో తన పదునైన కవిత్వం ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన మహాకవి గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి అన్నారు. సోమవారం గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రార్థనా సమావేశంలో జాషువా చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ బాబు, ఒబ్బుదేవి ప్రసాద్, నాదెండ్ల మురళి, వేణుగోపాల్, దాసు, లక్ష్మయ్య, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు పట్టణంలోని సి.ఐ. టి.యు కార్యాలయంలో గుర్రం జాషువా 52 వ వర్ధంతి సభ సోమవారం సాయంత్రం కె.వి.పి. ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.వి.పి.ఎస్ నాయకులు అరుణాచలం మాట్లాడుతూ జాషువా సమాజంలో ని సామాజిక రుగ్మతలను తన కలం తో ఎదుర్కొన్నారని కొనియాడారు. యువత జాషువా ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె.వి.పి.ఎస్ గూడూరు పట్టణ నాయకులు అడపాల ప్రసాద్ , సి.ఐ. టి.యు నాయకులు ఎస్. సురేష్ గుర్రం రమణయ్య , పుట్టా శంకరయ్య , డాక్టర్ చంద్ర హాస్ , ఆరవ పర్వతయ్య , మాజీ కౌన్సిలర్ ఎంబెటి చంద్రయ్య పాల్గొన్నారు.


బిఎన్ కండ్రిగలో

4 నుంచి రాయలసీమ ఆర్గానిక్ మేళా



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆగస్టు 4 నుంచి 6వ తేదీ వరకు తిరుపతి నగర పరిధిలోని వినాయక నగర్ క్వార్టర్స్ వద్దనున్న టిటిడి మైదానంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాయలసీమ ఆర్గానిక్ మేళా-2023 ను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కుమారస్వామి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయానికి ఆదరణ పెరిగిందని.. మార్కెటింగ్ చేసుకోవడానికి ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వ్యవసాయ పరిశోధకులు గంగాధరం, మనోహర్, ధనంజయరెడ్డి, పథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించడం సంతోషకరం



ప్రజాశక్తి -కోట: ఆపదలో ఉన్నవారికి తక్షణమే సకాలంలో ఆర్థికసాయం అందించడంలో సంతోషం ఉంటుందని శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య అన్నారు. సోమవారం కోట గూడలి పంచాయతీ ప్రకాశం కాలనీలో నివాసం ఉంటున్న కటికాల నారాయణ అనారోగ్యంతో ఉండటంతో శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య రూ.వెయ్యి అందించారు. నెల్లూరులో నివాసం ఉంటున్న ఓరుగుంటి ఫణేంద్ర కుమార్ దాతత్వంతో నారాయణకు మందుల ఖర్చు నిమిత్తం ప్రతినెలా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. వేములూరు బాబురావు ఉన్నారు.

సర్పంచుల నిధుల మాయంపై ధర్నా



ప్రజాశక్తి-తిరుచానూరు: కేంద్ర ప్రభుత్వం అందించిన 14,15వ ఆర్థిక సంఘ నిధులను గత రెండు న్నర ఏళ్లగా మాయం చేయడంతో రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట సర్పంచులతో కలసి ధర్నా చేపట్టారు. సర్పంచుల నిధులు రూ.8,628 కోట్లను మాయం చేసి జగన్ సంక్షేమ పథకాల పేరుతో దుర్వినియోగం చేస్తున్నారన్నారు. రావాల్సిన నిధులు ఇవ్వాలని.. లేకుంటే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

మొక్కలే ప్రాణకోటికి జీవనాధారం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మొక్కలే ప్రాణకోటికి జీవనాధారమని.. పతిఒక్కరూ విరవిగా మొక్కలను పెంచాలని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ గోపి అన్నారు. సోమవారం పుత్తూరులో పాఠశాల ఆధ్వర్యంలో పట్టణంలో వనమహోత్సవం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ద్రాక్షాయణి, వైస్ ప్రిన్సిపల్ ప్రియ, సుబిత, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని డాక్టర్ సిఆర్ రెడ్డి పెన్షనర్ల భవనంలో లయన్స్ క్లబ్ గూడూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆర్ రవిచంద్ర రెడ్డి, కార్యదర్శిగా శివయ్య, ట్రెజరర్‌గా వీరేంద్రనాథ్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రియాజ్ అహ్మద్, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ భయ్యా రవికుమార్, రీజియన్ ఛైర్మన్ డి.వి శరత్ బాబు, జోన్ ఛైర్మన్ గురునాథం, రామ్‌మోహన్ రావు, వాకాటి రామ్మోహన్‌రావు, మురళీరెడ్డి, రూపేష్‌రెడ్డి, సోమిశెట్టి చెంచు రామయ్య, రజనీకాంత్‌రెడ్డి, మదనమేటి రమణయ్య, ఇస్సాకు, శీనయ్య పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షలు నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని విద్యార్థి సంఘాల విజ్ఞప్తి మేరకు మంగళవారం విద్యా సంస్థల సమస్యలపై నిర్వహించతలపెట్టిన బంద్ కారణంగా రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రామకృష్ణాపురం పంచాయతీలో తాగునీటి పైపులైన్లకు సోమవారం సర్పంచి విరిత దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైస్ సర్పంచ్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి మునినరేష్‌కుమార్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల తనిఖీ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో రూ.8.20 లక్షలతో జరుగుతున్న కల్వర్టు, డ్రైనేజీ కాలువ నిర్మాణాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలని.. వెంటనే పూర్తి చేసి ప్రజలకు అంతరాయం లేకుండా చూడాలని గుత్తేదారులకు సూచించారు. మున్సిపల్ డీఈ, ఏఈలు, కౌన్సిలర్ ఏకాంబరం, గుత్తేదారులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయండి



ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో భూముల రీసర్వేను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా సర్వేను పూర్తి చేయాలన్నారు. మండలంలోని 35,406 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఉన్నాయని.. భూముల రికార్డులను పరిశీలించి వాటిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారుతోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు, వెంకటగిరి మండలాల్లో జగనన్న శాశ్వత భూహక్కు రక్షలో భాగంగా రీసర్వే జరిగిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని గూడూరు రెవెన్యూ డివిజన్ అధికారి కిరణ్ కుమార్ ఆదేశించారు. సోమవారం వెంకటగిరి, గూడూరు మున్సిపాలిటీల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలతోఆయన సమీక్షించారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలకు కేటాయించబడిన గ్రామానికి వెళ్లి స్టోన్ ప్లాంటేషన్ వేగవంతంగా పూర్తి చేయాలని గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రోజూ మానిటరింగ్ చేయాలని ఆర్డీవో ఆదేశించారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం..!

- 'మురుగు'తో రోగాల బారిన ప్రజలు
- గ్రామాల్లో గాడితప్పిన పాలన
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



ప్రజాశక్తి-బాలాయపల్లి: ప్రత్యేకాధికారుల పాలనలోనూ పంచాయతీల్లో ప్రత్యేకత కనిపించడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు అభివద్ధి పనులు నిలిచిపోయాయి. ఆరు నెలలుగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో డ్రైనేజీల్లో మురుగు, వీధుల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతుండటంతో పాటు దోమలు విజంభిస్తున్నాయి. అంటురోగాలు వ్యాపిస్తాయని మండలంలోని యాచవరం గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెలిసిందే. జిల్లాలో పారిశుద్ధ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దష్టి సారించి పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 5 నుంచి సెప్టెంబర్ 11 వరకు గురుకుల పాఠశాలల్లో పకడ్బందీగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాచరణను చేపట్టాలని ఆదేశించింది.

అధికారులు నిర్లక్ష్యం

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత.. పారిశుద్ధ్యం లోపిస్తున్నా.. అధికారులు.. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. నిత్యం కాలువల్లో పారే మురుగు నీరు రోడ్లపైకి చేరుకుంటున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించే మార్గాలను అన్వేషించకుండా అధికారులు, నాయకులు కాలయాపన చేయడం అనేక విమర్శలకు తావిస్తుంది. అధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతుంది. ఇప్పటికైనా వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలకుండా ముందే సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రకృతి సంరక్షణ అందరి బాధ్యత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రకృతి సంరక్షణ సమాజంలో అందరూ బాధ్యతగా తీసుకోవాలని మిస్ ఇండియా ఐకానిక్ దివా విజేత చిన్నతంబు భావన పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ మిస్ ఇండియాగా నిలిచిన తాను సమాజానికి మేలు చేయాలనే ఉద్దేశంతో 'మిత్ర ఫౌండేషన్' ను స్థాపించానని.. పేదలకు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. వాయు కాలుష్యం, ప్లాస్టిక్ వాడకం, నీటి కాలుష్యం, మొక్కల ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రకృతి పరిరక్షణ లక్ష్యంగా సెప్టెంబర్ 12 వ తారీఖున తిరుపతి శిల్పారామంలో ట్రెడిషనల్ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నామన్నారు. చిన్న పిల్లల నుండి 45 సంవత్సరాల వయసు వరకు ఉన్నవారు ఈ సాంప్రదాయ ఫ్యాషన్ షోలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బాలాజీ, గోపికృష్ణ, మల్లిక, సింధు, మోహన్ రెడ్డి, ప్రసాద్ రావు, దామోదర్ రెడ్డి, రాహుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీతో ప్రజల మానప్రాణాలకు ముప్పు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బీజేపీతో దేశ ప్రజల మానప్రాణాలకు ముప్పు ఉందని సీపీఎం పట్టణ బాధ్యుడు గంధం మణి హెచ్చరించారు. మణిపూర్ రాష్ట్రంలో మైతేయిల రూపంలో కాషాయి మూకలు చేస్తున్న ఆరాచకాలే ఇందుకు నిదర్శనమన్నారు. మణిపూర్ అల్లర్లను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా చేపట్టార్ను. డబల్ ఇంజన్ సర్కార్ అంటూ ఊదరగొడుతున్న బిజెపి మణిపూర్లో రెండు తెగల మధ్య అల్లర్లను నిలువరించడంలో విఫలమైందన్నారు. అల్లరి మూకలు మహిళలను చరబట్టే క్రమంలో అన్నదమ్ములను తల్లిదండ్రులను పాసవికంగా హతమార్చడం దుర్మార్గమైన చర్యని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి శాంతి భద్రతలను పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో గుజరాత్ రాష్ట్రంలా మణిపూర్ తగలబడి పోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, వెలివేంద్రం, ఉస్మాన్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలి

పాకాల: అత్యాచార నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని వైసీపీ రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ నంగా పద్మజారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ముగ్గురు మహిళలను ఊరంతా నగ్నంగా ఊరేగింపు నిర్వహించి, అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే ఎన్ కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పాకాల: మోడీ ప్రభుత్వంలో ఇటీవల మణిపూర్‌లో ఇద్దరు క్రైస్తవ స్త్రీలను నగ్నంగా ఊరేగించడం భారతదేశమంతా తలదించుకునే రోజని కెవిపిఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి మధుసూదన్ రావు అన్నారు. సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పాకాలలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ప్రజాశక్తి-దొరవారిసత్రం: జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని.. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి కోరారు. సోమవారం తుంగమడుగు, వెదురుపట్టు, వేణుంభాకం గ్రామాల్లో శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దారు గోపిరెడ్డి, ఎంపీడీవో సింగయ్య, ఎస్ఐ తిరుమలరావు, జడ్పిటిసి సభ్యులు రమేష్, వైసీపీ మండలాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, నాయకులు ఆనేపూడి భాస్కర్ రెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుదిదశలో శ్రీనివాస సేతు నిర్మాణం



తిరుపతి టౌన్ : తిరుపతి శ్రీనివాస సేతు తుది దశ పనులను వేగవంతం చేయాలని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి బస్టాండ్ వద్ద రైల్వే వంతెనపై జరుగుతున్న పనులను సోమవారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఎఎస్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల గురించి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి కమిషనర్ హరిత వివరిస్తూ రైల్వే వంతెనపై ఇప్పటికే అతి కిలకమైన ఆరు గెడ్డెర్లను అమర్చడం జరిగిందని, ఆ గెడ్డెర్లపై డెక్ స్లాబ్ పనులు జరుగుతున్నాయని, ఆ తరువాత బిటి రోడ్డు వేయడంతో పనులు పూర్తి అవుతాయని వివరించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ ఇప్పటికే మూడు దశలుగా శ్రీనివాస సేతును ప్రారంభించడం జరిగిందని, ఈ నాల్గవ దశ పూర్తి అయితే శ్రీనివాస సేతు మొత్తం పూర్తి అయినట్లేనని అన్నారు. ఈ నెలాఖారకి పనులు మొత్తం పూర్తి అవ్వాల్సిందేనని పనులు చేపట్టిన ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు వీల్‌చైర్స్ పంపిణీ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ఫ్లోరైడ్ ప్రాంత మండలాలలో తాగునీరు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్లో స్పందన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ , రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్ బాధితులకు వీల్ చైర్స్, రిహాబిలిటేషన్ ఎక్విప్మెంట్స్ కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఫ్లోరైడ్ ప్రాంత మండలాలలో తాగునీటి సౌకర్యం కలిగించేలా చర్యలు తీసుకోవాలని అర్డబ్ల్యూఎస్ శాఖ అధికారును ఆదేశించారు. ప్రతి ఫ్లోరైడ్ బాదిత గ్రామం లోని పాఠశాల విద్యార్థులకు, గ్రామ ప్రజలకు డెంటల్ ఫ్లోరోసిస్, స్కెలిటల్ ఫ్లోరోసిస్ ను ప్రారంభ దశలోనే గుర్తించాలని అన్నారు. ప్రజలకు సేవ చేసే కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడూ ముందు ఉండి మరిన్ని సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డా. శ్రీహరి, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ డా కిరణ్ నాయక్, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ డాక్టర్ ప్రణీత్, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-వెంకటగిరి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని.. ఇందుకు సమ్మె నోటీసు అందించామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు కార్మికులపై కక్ష సాధింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి ప్రసాద్, నాయకులు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, మణి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థుల భావోద్వేగ ప్రవర్తనపై వర్క్‌షాప్



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని హోమ్‌సైన్స్ విభాగం, ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఆచార్య అనురాధ వెల్లడించారు. సోమవారం వర్సిటీ ఉపకులపతి చాంబర్లో ఆచార్య కె.రాజారెడ్డి చేతుల మీదుగా వర్క్ షాప్ కు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ డాక్టర్ బి. స్వరూప రాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానం




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని బజారువీధి పిడికిలి గంగమ్మ తల్లి ఆలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు నాయకులు సోమవారం ఆహ్వానించారు. జాతర కమిటి సభ్యులు విక్కీ కరణం కుమార్, గాలి జీవరత్నం నాయుడు, మురళీ, బాబు, ఆనంద్, సుధాకర్ స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని వినతి



ప్రజాశక్తి-తిరుచానూరు: ఉమ్మడి జిల్లాల్లో 12 ఇసుక రీచ్‌లల్లోని తవ్వకాలు నిలిపేయాలని గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అథారిటీ సుప్రీంకోర్టు ఆదేశాలు చేసినప్పటికీ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ కలెక్టరేట్‌లోని స్పందనలో వినతిపత్రం అందించారు. ఆయనతోపాటు నాయకులు దంపూరి భాస్కర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం



ప్రజాశక్తి-బాలాయపల్లి: జగనన్న కాలనీల్లో నిర్మాణాలకు ముందస్తు కొంత నగదు అడ్వాన్స్‌గా ఇస్తామని.. వెంటనే పనులు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ జహీరుద్దీన్ తెలిపారు. సోమవారం మన్నూరు సచివాలయంలో గృహ నిర్మాణాలపై లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈ రాజా, వర్క్ ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శులు రాజయ్య, హేమంత్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత అర్జీలకు ఆర్డీవో శ్రీకారం



ప్రజాశక్తి-గూడూరు: స్థానిక గ్రామోద్యోగుల భవనం ఎదుట ఏర్పాటుచేసిన ఉచిత అర్జీల కార్యక్రమాన్ని ఆర్డీవో కిరణ్‌కుమార్ సోమవారం సందర్శించి వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి సోమవారం పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా ఉచితంగా బాధితుల పూర్తి వివరాలతో అర్జీలు రాసివ్వాలని సూచించారు. ప్రతిఒక్కరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విశ్వం విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం నిర్వహించిన స్పేస్ వీక్-2023లో వక్తృత్వ, ఓపెన్ హౌజ్ క్విజ్, వర్క్‌షాప్ ఆన్ రోవర్ మేకింగ్, ఇంటర్ స్కూల్ క్విజ్ తదితర కార్యక్రమాల్లో విశ్వం విద్యార్థులు పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మనీషా, ట్వింకల్, దేవాన్షి, శ్రావ్య, మేఘశ్యామ,ముని రూపేష్ లను విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్. విశ్వనాథ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ యన్. విశ్వ చందన్ రెడ్డి అభినందించారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థుల సమస్యలపై నేడు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్, పీఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్వి యూనివర్సిటీ పరిపాలనా భవనం నుంచి బైక్ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి చలపతి, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు కోటే హేమంత్, పిఆర్ఎస్ఎఫ్ నాయకులు సుంకు రవీంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు సుందర్, నవీన్, నగర నాయకులు ప్రవీణ్, చంద్ర నాయక్, వేణు, సురేంద్ర, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, వెంకటేష్, పిఆర్ఎస్ఎఫ్ నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో ఉచిత వైద్య సేవలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను అనారోగ్య సమస్యల నుండి దూరం చేయాలనే ఉద్దేశంతో నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నారని తిరుమల నగర్ పంచాయతీ వైసీపీ ఇన్‌ఛార్జి గుండ్రాజు శివశంకరాజు తెలిపారు. సోమవారం తిరుమలనగర్‌లో జరిగిన ఉచిత వైద్యశిబిరంలో 760 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటనారాయణ, వైద్యాధికారులు జయంతి, స్రవంతి, ఏపీఎం గురునాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యత

తిరుపతి సిటి : స్పందనలో వృద్ధులు మహిళలు ఇచ్చిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను కూలంకుషంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిసినల్ ఎస్పీలు వెంకట్రావు, విమలకుమారి పాల్గొన్నారు.

మాణిపూర్ ఘటన పైచాచిక చర్య

తిరుపతి సిటి : ప్రపంచం లోనే అతి కిరాతకమైన పరిస్థితులు మాణిపూర్ లో జరుగుతున్నాయని, మోదీ ప్రభుత్వం ఉదాసీనత గా వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. సోమవారం తిరుపతి పరిధిలోని ఏబి బర్ధన్ కాలనీ లో నిర్మించిన బర్ధన్ కమ్యూనిటీ భవన్‌ను ప్రారంభించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మణి పూర్ లో ఉన్న గిరిజనులు ఓ కొండ ప్రాంతంలో నివాసం వుంటున్నారన్నారు. మంచి విలువలు, సంపద కలిగిన భూములు ఉన్న ప్రదేశం అన్నారు. బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా భూసంపద కొట్టేయడానికి ఆదానికి ఇప్పటికే 54 వేల ఎకరాలు భూమిని అప్పగించిందన్నారు. దీనికి అడ్డుపడుతున్న గిరిజనులపై మరో వర్గాన్ని పురిగొలిపి అల్లర్లు సష్టిస్తున్నట్లు చెప్పారు. బిజెపి ప్రభుత్వం అక్కడ సంపదని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు అరాచకాలు ప్రోత్సహిస్తోందని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు.